క్లుప్తంగా

తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రావు



అభినందిస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్(దుబ్బాక): దౌల్తాబాద్ మండల నూతన తహసీల్దార్‌గా పి.చంద్రశేఖర్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గజ్వేల్ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా విధులు నిర్వహించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన దండి సుజాత గజ్వేల్ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు.

సైక్లింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో పీడీ ప్రవీణ్

చిన్నకోడూరు(సిద్దిపేట): నిజామాబాద్ జిల్లాలో 14, 15 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహిళా సైక్లింగ్ పోటీలకు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులైన కుచ్చుల రాగిణి, బానంపల్లి వైష్ణవి ఎంపికపై హెచ్‌ఎం పద్మలత, పీడీ ప్రవీణ్, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీలో డ్రైడే..



నీటిని పారబోస్తున్న స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో పర్యటించిన చైర్‌పర్సన్ స్వరూపరాణి, ఆయా వార్డుల కౌన్సిలర్లు ఇళ్లవద్ద నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ వంటివి ప్రబలకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగానే ప్రతి శుక్రవారం పట్టణ ప్రజలందరూ డ్రై డేను పాటించాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారికి భూ సేకరణ



మాట్లాడుతున్న ఆర్డీఓ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్ల గ్రామ పరిధిలో జాతీయ రహదారి కోసం రెవెన్యూ అధికారులు చేపట్టిన భూ సేకరణలో భాగంగా శుక్రవారం ఆర్డీఓ రాంమూర్తి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా 100ఫీట్లు వెడల్పు చేశారని, దీని కోసం పందిల్ల గ్రామంలో 6.39 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా రైతుల అభిప్రాయాలను సేకరించి అవార్డులను ప్రకటించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీందర్‌రెడ్డి, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



రాజయ్యను సన్మానిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆ పార్టీనేత సాకి ఆనంద్ తెలిపారు. రాజయ్యకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించినట్లు తెలిపారు. మహేందర్, రవి, కిషన్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తే చర్యలు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ అభిలాష్ హెచ్చరించారు. మండలంలోని తంగళ్లపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా బోలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను గురువారం ఆయన ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆ వాహనాన్ని తహసీల్దార్‌కు అప్పగించి మాట్లాడుతూ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

చెరువు కట్ట.. కుదిస్తే ఎట్లా?

కాకతీయుల కాలంలో నిర్మించిన ఎల్లమ్మ చెరువు కట్టను రోజురోజుకు కుదిస్తున్నారు. మరమ్మతుల పేరిట లక్షలు ఖర్చు చేసినా వర్షాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. వేసిన ఫ్లోరింగ్ ధ్వంసమైంది. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనడానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

– హుస్నాబాద్

- వెడల్పు తగ్గితే ప్రమాదకరం
- రూ.కోట్లతో మరమ్మతులు
- నాణ్యతలేని పనులతో పగుళ్లు, కోతలు



కుదించుకుపోయిన ఎల్లమ్మ చెరువుకట్ట

కోట్లు వెచ్చించి మరమ్మతులు

కాకతీయుల కాలంలో వందల ఎకరాల విస్తీర్ణంలో ఎల్లమ్మ చెరువును నిర్మించారు. దీని ద్వారా దాదాపు 2వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ చెరువును మిని ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసేందుకు దాదాపు రూ.6.50కోట్లు, సుందరీకరణ పేరిట మరో రూ.3.50కోట్లు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు.

నాణ్యత కరువు..

పటిష్టంగా ఉన్న చెరువు కట్ట మొదటి తూమ్‌ను మరమ్మతుల పేరిట నాశనం చేశారనే విమర్శలున్నాయి. వర్షాలకు కట్టకు పగుళ్లు ఏర్పడ్డాయి. బుంగపడడంతో పాటు వేసిన ఫ్లోరింగ్ లేచి పోయింది. అధికారుల ముందస్తు ప్రణాళిక లేకపోవడమో, పర్యవేక్షణ కొరవడడమో తెలియదు కాని చెరువు కట్టను కుదించి వేశారు. ఒకప్పుడు 60 నుంచి 70ఫీట్ల వరకు ఉండే కట్ట ఇప్పుడు సగానికి సగం తగ్గించారు.



వర్షాలకు ఏర్పడిన కోత

బతుకమ్మ వేడుకలు..

ప్రతియేటా జరిగే బతుకమ్మ వేడుకలు ఎల్లమ్మ చెరువు కట్టపై ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేలాది మంది మహిళలు చేరి బతుకమ్మ ఆడుకుంటూ సందడి చేస్తారు. అక్టోబర్‌లో నిర్వహించనున్న బతుకమ్మ ఆటలు ఇరుకు కట్టపైనే ఆడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

కట్ట వెడల్పు పెంచాలి

చెరువు సుందరీకరణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల రూ.18 కోట్లు మంజూరు చేయించారు. గతంలో ప్రణాళికలు లేకుండా నిధులను దుర్వినియోగం చేశారు. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. ఇరుకుగా ఉన్న కట్టకు మరమ్మతులు చేపట్టి వెడల్పు చేసిన తర్వాతనే సుందరీకరణ పనులు చేపడితే ఎల్లమ్మ చెరువు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అంటున్నారు.

వెడల్పు తగ్గించడం ప్రమాదకరం

చెరువు కట్ట వెడల్పును తగ్గించడం వల్ల చెరువుకే ప్రమాదం వాటిల్లుతుంది. ఈ చెరువు ద్వారా దాదాపు 2వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. సాగునీరు వెళ్లే కాలువలు ధ్వంసమవుతున్నాయి. కట్ట వెడల్పును పెంచి సుందరీకరణ చేపడితే ఎల్లమ్మ చెరువు పర్యాటక కేంద్రంగా ఆకట్టుకుంటుంది.

– గుడిపల్లి రాజు, రైతు, హుస్నాబాద్

దేశ సమైక్యతకు నిదర్శనం హిందీ

చిన్నకోడూరు(సిద్దిపేట)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక: మండల పరిధిలోని అనంతసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హిందీ చేతిరాత, ఉపన్యాసం, చిత్రలేఖనం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జ్యోతి మాట్లాడుతూ ఉన్నత చదువుల్లో విజయం సాధించాలంటే హిందీపై పట్టు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. హిందీ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీలో వ్యాసరచన, ఉపన్యాస, కవిత పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ హిందీ దేశ సమైక్యత, సమగ్రతను చాటుతుందన్నారు.దుబ్బాక మున్సిపల్ పరధిలోని ధర్మాజీపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సాదత్‌అలీ, బాలకృష్ణ పాల్గొన్నారు.



చిన్నకోడూరు(సిద్దిపేట) మాట్లాడుతున్న జ్యోతి

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

- మధుసూదన్‌కు ఘనంగా సన్మానం



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: అధ్యాపకులు నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు తప్పకుండా వస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్‌ను కళాశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తదితరులు మాట్లాడారు. 2001లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన మధుసూదన్ అంచెలంచెలుగా ఎదిగి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తూ ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. పరిశోధనలో అంతర్జాతీయ జర్నల్స్‌లో 20పత్రాలు, మూడు పేటెంట్ హక్కులు, సింగపూర్, స్పెయిన్‌లో పరిశోధనాపత్రాలు సమర్పించడం గొప్ప విషయమని కొనియాడారు. కళాశాలలో న్యాక్ కో–ఆర్డినేటర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే ఎల్ఈడీ బల్బులు, రోబోటిక్స్ తయారీలో విద్యార్థులకు శిక్షణను ఇస్తున్నారని చెప్పారు. అనంతరం మధుసూదన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాపయ్య, అధ్యాపకులు గోపాల సుదర్శనం, అయోధ్యరెడ్డి, మహేశ్వరి, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

దుబ్బాకరూరల్: తాగునీరు రావడం లేదని ఆగ్రహించిన మహిళలు మండలంలోని తిమ్మాపూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు సరిగా సరఫరా కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సింగిల్ ఫేజ్ మోటర్లు సరిగా పనిచేయడం లేదని మండిపడ్డారు. రెండు, మూడు నెలల నుంచి నీటి సరఫరా ఇబ్బందికరంగా మారిందని, ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీళ్లు సరఫరా చేయడం వల్ల ఎవ్వరికీ సరిపోవడం లేదని వాపోయారు. అలాగే కాలనీలో రాత్రివేళలో వీధి దీపాలు కూడా వెలగడం లేదని అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న మహిళలు

కానిస్టేబుల్ సస్పెన్షన్

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.శంకర్‌ను సస్పెండ్ చేసినట్టు పోలీస్ కమిషనర్ అనురాధ శుక్రవారం తెలిపారు. సీసీఏ రూల్స్ అతిక్రమించడంతో పాటు క్రమశిక్షణ రహితంగా ప్రవర్తించడంతో సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 15మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.22వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సిమెంట్ లారీని ఢీకొన్న టిప్పర్

గజ్వేల్‌రూరల్: ముందు వెళ్తున్న ఓ సిమెంట్ లారీని టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని కొడకండ్ల వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు సిమెంట్ లోడుతో ఓ లారీ వెళ్తోంది. ఈ క్రమంలో మండల పరిధిలోని కొడకండ్ల చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న మరో లారీని తప్పించబోయి వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ యాదగిరి గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి : ఏసీపీ

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. పట్టణంలోని 1వ వార్డులోగల ఎంపీపీఎస్‌లో శుక్రవారం క్రమశిక్షణ–వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములై ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. విద్యార్థులకు టై, బెల్టులు, నోటు పుస్తకాలను పంపిణీ చేసిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, సీఐ సైదా తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలను సద్వినియోగం చేసుకోండి

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: లబ్ధిదారులు దుకాణ సముదాయాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న వీధి వ్యాపారుల విక్రయ దుకాణ సముదాయాలను పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వ్యాపారులు ప్రతిరోజు తప్పనిసరిగా దుకాణం తెరిచి పెట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు దుకాణాలను తనిఖీ చేయాలని మెప్మా అధికారులకు సూచించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని వార్డుల్లో శనివారం మానేరు నీటి సరఫరా ఉండదని ఆశ్రిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోయర్ మానేరు డ్యామ్ కాజ్ సంబంధించిన పైప్‌లైన్‌లకు ఇల్లంతకుంట వద్ద మరమ్మతులు నిర్వహిస్తున్నారని దీంతో 18, 19, 20, 21, 36, 37వ వార్డుల్లో నీటి సరఫరా నిలిపివేసినట్టు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. తిరిగి ఆదివారం తాగునీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.



షాపులను పరిశీలిస్తున్న ఆశ్రిత్ కుమార్

అమ్మా బాగున్నారా..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అమ్మ బాగున్నారా? సౌకర్యాలు ఎలా ఉన్నాయి? అంటూ మున్సిపల్ కమిషనర్ వృద్ధులను పలకరించారు. శుక్రవారం పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం నిర్వహణ తీరును, గృహాల నుండి వెలువడే మురుగునీటిని శుద్ధిచేసే ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఎర్రచెరువులో ఉన్న గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కార్మిక, కర్షక పక్షపాతి ఏచూరి

- సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాల స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాక/చిన్నకోడూరు(సిద్దిపేట): ఏచూరి సీతారాం తన తుదిశ్వాస వదిలే వరకు గొప్ప పోరాటాలు చేసిన కార్మిక కర్షక పక్షపాతి అని సీపీఎం జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి కొనియాడారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో శుక్రవారం ఏచూరి సీతారాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి 50యేళ్ళుగా పార్టీలో సిద్ధాంతాలకు కట్టుబడి నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో మతోన్మాదం, ప్రైవేటీకరణపై ఉద్యమాలు సాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇదారి క్రాంతి, పారస్వామి, ఊస నాగరాజు, షఫీ, షాదుల్, అన్వర్, శ్రీనివాస్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో మండల కన్వీనర్ లింగంపేట ఎల్లయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కుమార స్వామి, ఇంద్రం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. దుబ్బాకలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు భాస్కర్ తదితరులు ఉన్నారు. చిన్నకోడూరులో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజవర్ధన్ రెడ్డి, బాలయ్య, రాములు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): నివాళులర్పిస్తున్న గోపాల స్వామి తదితరులు

కూల్చివేతలు.. బాధితుల వెతలు



మెయిన్ రోడ్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

హుస్నాబాద్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలోని మెయిన్ రోడ్‌లోని ఇళ్లు, దుకాణాలను యజమానులు స్వచ్ఛందంగా కూల్చివేస్తున్నారు. గత 10వ తేదీన నేషనల్ హైవే సిబ్బంది జేసీబీల సహాయంతో ఇళ్ల కూల్చివేత ప్రారంభించారు. 100 ఫీట్ల రహదారి విస్తరణ కోసం నేషనల్ హైవే సిబ్బంది మార్కింగ్ చేశారు. మార్కింగ్ ప్రకారం కూల్చివేతలకు ఇంటి యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. దీంతో మూడు రోజుల నుంచి వ్యాపారాలు నిలిచిపోయాయి. దాదాపు 150 వరకు డ్రిల్లింగ్ మిషన్లతో కూల్చివేత ప్రక్రియ కొనసాగుతోంది. డ్రిల్లింగ్ మిషన్ల శబ్దం, దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి వందలాది కార్మికులు పనుల్లో పాల్గొంటున్నారు. కూల్చివేతలో భాగంగా కొందరు బోర్లు కూడా కోల్పోవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దుకాణాలను మూసివేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, అలాగే ఒక్కో ఇంటి కూల్చివేతకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు నష్టం జరుగుతోందని వాపోతున్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: రాష్ట్రంలో పూర్తిగా నిరంకుశ పాలన సాగుతోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని తన నివాసంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయనను మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో సాక్షితో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు ధోరణిని అవలంభించడం దారుణమన్నారు.



దుబ్బాక: హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

పట్టణంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టుచేసి ఆయా పోలీసు స్టేషన్‌లకు తరలించారు. కొందరిని హౌజ్ అరెస్టు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండించారు.



సిద్దిపేటకమాన్: మాట్లాడుతున్న రాజనర్సు



హుస్నాబాద్: పోలీస్ స్టేషన్ ఆవరణలో నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ 17న సర్టిఫికెట్ వెరిఫికేషన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని సమగ్ర శిక్ష కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహించడానికి గాను 2023లో జరిగిన రాత పరీక్షలో అర్హత సాధించిన 1:3 నిష్పత్తిలోని అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లకు హాజరకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాని అభ్యర్థులు 7న ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు సిద్దిపేట మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

◆ పేర్లు సరి చూసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ జాబితాలను వార్డుల వారీగా అందుబాటులో ఉంచామని ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి తెలిపారు. పేర్లలో ఏవైనా తప్పొప్పులు ఉంటే సరిచూసుకోవాలని కోరారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21లోగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరి చేయించుకోవాలని సూచించారు.

◆ మంత్రుల కమిటీని ఉపసంహరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉప సంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల అభిప్రాయాలను సేకరించకుండా మంత్రులతో కమిటీ వేయడం విలువలకు విరుద్ధమన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, సిద్ధిరాములు, సురేష్, భాస్కర్, స్వామి, రవి పాల్గొన్నారు.

◆ సమష్టి కృషితోనే క్షయ నిర్మూలన

మిరుదొడ్డి(దుబ్బాక): క్షయ నిర్మూలనకు సమష్టిగా కృషిచేయాలని జిల్లా టీబీ అలర్ట్ ఇంపాక్ట్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ కోరారు. మిరుదొడ్డి పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల క్షయ వ్యాధి వ్యాప్తి చెందుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తి, సూపర్‌వైజర్ రాజ్‌చైతన్య, నఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సొంత నిధులతో మోటర్ మరమ్మతు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లె ఎస్సీ కాలనీలో పాడైన బోరుమోటర్‌ను మనకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ప్రజల ఇబ్బందులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సకాలంలో స్పందించినందుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

◆ నగరం నుంచి బహిష్కరించాలి

దుబ్బాక: తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీసేలా రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని హైదరాబాద్ నుంచి బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ చేస్తున్న దగాకోరు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రారెడ్డి, రమేష్‌గౌడ్, సాయిగౌడ్, కీసరి శ్రీనివాస్, తునికి సురేష్, స్వామి పాల్గొన్నారు

◆ ఉద్యోగులకు పదవి విరమణ సహజం

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమని సిద్దిపేట డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు చెలుకల తిరుపతిరెడ్డి పదవి విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయనతో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు తిరుపతి రెడ్డి దంపతులను సన్మానించారు. ఎంఈఓ పావని, నోడల్ అధికారి మహంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆ నాణేలు చెల్లుబాటులో ఉన్నాయి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఐదు, పది, ఇరువై రుపాయల నాణేలు చెల్లుబాటులోనే ఉన్నాయని, వాటని కొందరు నిరాకరించడం సరికాదని సిద్దిపేట హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసుదన్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో హోటల్ అసోసియేషన్ సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడుగా ఎన్నికయిన ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గోవిందారం నవీన్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, చిన్న, బాలు తదితరులు పాల్గొన్నారు.

◆ నిలిచిన సేవలు

కోహెడరూరల్(హుస్నాబాద్): మీసేవా కేంద్రాల్లో నాలుగు రోజులుగా సేవలు నిలిచిపోయాయి. ఎందుకు సేవలు నిలిపివేశారో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. సుమారు 40రకాల సేవలు అందజేస్తున్న మీసేవా కేంద్రంలో ఒక సర్వర్ కూడా పనిచేయడం లేదని వాపోతున్నారు.